సాక్షి
పశ్చిమగోదావరి
బుధవారం । 14 । మే । 2025



రేడియేటర్ పేలి గాయాలు

శ్రీవారి కొండపై ఓ భక్తుడి పాల వాహనంలోని రేడియేటర్ పేలి బాలికకు తీవ్ర గాయాలయ్యాయి. బాలికను ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. 8లో ▸



హద్దు మీరిన మట్టి దందా

ద్వారకాతిరుమల మండలంలోని పోలవరం కుడి కాలువ గట్టుపై పెద్ద ఎత్తున జరుగుతున్న మట్టి దందాలో కూటమి నేతల అక్రమాలు హద్దు మీరాయి. 8లో ▸



'సింగిల్' బృందం సందడి

సింగిల్ చిత్ర బృంద సభ్యులు మంగళవారం ఏలూరులో సందడి చేశారు. నగరంలోని ఎస్వీసీ థియేటర్‌లో ప్రేక్షకులను కలిసి తమ సంతోషాన్ని పంచుకున్నారు. 8లో ▸

బడి బస్సు భద్రమేనా?

- ఆందోళన కలిగిస్తున్న ప్రమాదాలు
- గతేడాది వేర్వేరు ప్రమాదాల్లో ఒకరు మృతి, పలువురికి గాయాలు
- సిబ్బంది చేతివాటం, తూతూమంత్రంగా తనిఖీలు

- **సెప్టెంబరు 10 :** పెనుమంత్ర మండలం మాముడూరు నుంచి భీమవరం వస్తున్న ప్రైవేట్ కళాశాల బస్సు పాలకోడేరులో అదుపుతప్పి పంట బోదెలోకి దూసుకుపోయి మట్టిలో కూరుకుపోయింది. ప్రమాద సమయానికి బస్సులో 20 మంది విద్యార్థులు ఉండగా వారిలో ఒకరికి కాలు, చేయి విరిగిపోయింది. 11 మంది స్వల్పగాయాలతో బయటపడ్డారు.
- **సెప్టెంబరు 20 :** తణుకులోని ఒక ప్రైవేట్ స్కూల్‌కు చెందిన బస్సు జాతీయ రహదారిలోని డీమార్టు సమీపంలో అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టి అవతలి వైపునకు దూసుకువెళ్లి బోల్తా కొట్టింది. ఈ ఘటనలో లిఫ్టు కోసం ఎక్కిన మరో బస్సు క్లీనర్ మృతిచెందాడు.
- **డిసెంబరు 2 :** ఇరగవరం మండలం అర్జునుడుపాలెం రోడ్డులో విద్యార్థులతో ఉన్న రెండు స్కూల్ బస్సులు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఆ వేగానికి అందులోని చిన్నారులు సీట్లలోంచి చెల్లాచెదురుగా పడిపోయారు. అదృష్టవశాత్తు స్వల్పగాయాలతో బయటపడ్డారు. హుటాహుటిన చిన్నారులను 108 అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించారు.





తణుకులో బోల్తా పడిన స్కూల్ బస్సు (ఫైల్), అర్జునుడుపాలెంలో గాయపడిన విద్యార్థులను 108లో తరలిస్తున్న దృశ్యం(ఫైల్)

సాక్షి, భీమవరం / భీమవరం (ప్రకాశంచౌక్) : జిల్లాలో 463 ప్రైవేట్ విద్యాసంస్థల పరిధిలో 1,566 స్కూల్ బస్సులు ఉన్నాయి. విద్యార్థుల ప్రయాణ భద్రత దృష్ట్యా విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందు రవాణ శాఖ స్కూల్ బస్సుల సామర్థ్యాన్ని పరీక్షించి పూర్తి సామర్థ్యంతో ఉన్న వాటికి ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు(ఎఫ్‌సీ) జారీచేయాలి. ఎఫ్‌సీ లేనివాటిని సీజ్ చేయాలి. గత ఏడాది ఎఫ్‌సీ గడువు ముగియడంతో రానున్న విద్యాసంత్సరానికి జిల్లాలోని భీమవరం, పాలకొల్లు, తణుకు, తాడేపల్లిగూడెంలోని రవాణశాఖ కార్యాలయాల్లో బస్సులకు ఫిట్‌నెస్ పరీక్షలు చేపట్టి సోమవారం నాటికి 849 బస్సులకు పూర్తి చేశారు.

తూతూమంత్రంగా తనిఖీలు

బస్సు బ్రేక్, హ్యాండ్ బ్రేక్, స్టీరింగ్, టైర్లు, స్పీడో మీటర్, లైట్లు, గ్లాసులు, అత్యవసర ద్వారం, మంటలను ఆర్పే పరికరం తదితర వాటి కండిషన్‌ను మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్లు స్వయంగా పరీక్షించాలి. బస్సుకు నాలుగు వైపులా రిఫ్లెక్టివ్ టేపు అతికించి ఉందా? లేదా? ఫస్ట్ ఎయిడ్ బాక్స్, బస్సు బయలుదేరే సమయం, ఆగే స్థలాలు, రూట్ ప్లాన్ వివరాలు వంటివి పరిశీలన చేయాలి. ఆ బాధ్యతను కిందిస్థాయి సిబ్బందికి అప్పగించి తూతూ మంత్రంగా తనిఖీలు చేయిస్తున్నారన్న విమర్శలున్నాయి. కొందరు సిబ్బంది చేతివాటం ప్రదర్శిస్తూ చూసీచూడనట్లు వదిలేస్తున్నట్టు తెలుస్తోంది.

కొరవడిన పర్యవేక్షణ

స్కూల్ బస్సుల వేగం గంటకు 60 కిలోమీటర్లు మాత్రమే ఉండేలా స్పీడ్ గవర్నర్స్ తప్పనిసరి. కాగా కొందరు డ్రైవర్లు ఇరుకు సందుల్లో వేగంగా పోనిస్తూ దారిన వెళ్లే వారిని హడలెత్తిస్తున్నారు. కొందరు విధుల్లో మద్యం సేవించి ఉంటున్నారని, సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేస్తూ విద్యార్థుల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు. గతంలో జరిగిన పలు ప్రమాదాలకు నిర్లక్ష్య డ్రైవింగ్, వాహనాలు కండీషన్‌లో లేకపోవడం కారణమన్న విమర్శలున్నాయి. అధికారులు, స్కూల్ యాజమాన్యాల పర్యవేక్షణ కొరవడటం డ్రైవర్ల ఇష్టారాజ్యంగా మారుతోంది.

రవాణ శాఖ కార్యాలయం	స్కూల్ బస్సులు	ఫిట్‌నెస్ పరీక్షలు పూర్తయినవి
భీమవరం	557	298
పాలకొల్లు	331	166
తణుకు	234	142
తాడపల్లిగూడెం	444	243

పక్కాగా ఫిట్‌నెస్ పరీక్షలు



అక్రమాలకు తావులేకుండా జిల్లాలో ఫిట్‌నెస్ పరీక్షలు పక్కాగా నిర్వహిస్తున్నాం. గత ప్రమాదాలకు కారణాలను విశ్లేషించి అవసరమైన చర్యలు తీసుకున్నాం. ఫిట్‌నెస్ లేని బస్సులను సీజ్ చేస్తాం.

ఉమా మహేశ్వరరావు,
జిల్లా రవాణ శాఖ అధికారి, భీమవరం

పేరెంట్స్ కమిటీ పరిశీలించాలి

బస్సులోని ఫస్ట్‌ఎయిడ్ బాక్స్‌ను నెలకోసారి పేరెంట్స్ కమిటీ పరిశీలించాలి. సీటింగ్ కెపాసిటికి మించి విద్యార్థులను ఎక్కించకూడదు. ప్రతి నెల బస్సు కండిషన్‌ను యాజమాన్యాలు, పాఠశాల పేరెంట్స్ కమిటీ తనిఖీ చేయాలి. బస్సులో ఫిర్యాదుల పుస్తకం ఉంచి ప్రతి నెలా యాజమాన్యం తనిఖీ చేసి ఫిర్యాదులను పరిశీలించాలి. రవాణా, పోలీస్, విద్యా శాఖల సౌజన్యంతో విద్యార్థులకు రోడ్ సేఫ్టీ తరగతులు నిర్వహించాలి.

భారీగా సెల్‌ఫోన్ల రికవరీ

15వ విడతలో 594 సెల్‌ఫోన్లు బాధితులకు అందజేత



ఏలూరు పోలీసులు రికవరీ చేసిన సెల్ ఫోన్లు

ఏలూరు టౌన్: జిల్లా పోలీసులు శ్రమించి వందలాది సెల్‌ఫోన్లు రికవరీ చేసి బాధితులకు అందజేశారు. జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయం వద్ద రికవరీ చేసిన సెల్‌ఫోన్లు మంగళవారం ఎస్పీ చేతులమీదుగా బాధితులకు అందజేశారు. 15వ విడతలో 594 మొబైల్ ఫోన్లు రికవరీ చేశారు. వాటి విలువ మార్కెట్‌లో సుమారు రూ.71.28 లక్షలు ఉంటుందని అంచనా. ఏలూరు జిల్లాలో మొత్తంగా 15 విడతల్లో 2,976 మొబైల్ ఫోన్లు పోలీస్ అధికారులు రికవరీ చేశారు. ఈ సెల్‌ఫోన్ల విలువ ఏకంగా రూ.4.75 కోట్లు ఉంటుందని అంచనా.. ఈ సందర్భంగా ఎస్పీ కేపీ శివకిషోర్ మాట్లాడుతూ... చోరీ వస్తువులు కొనడం, విక్రయించటం రెండూ నేరమేనని స్పష్టం చేశారు. సైబర్ నేరాలు, చోరీలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. తమ ఇళ్లు, షాపులు, ఇతర రద్దీ ప్రాంతాల్లోని దుకాణ సముదాయాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, ఏదైనా నేరం జరిగితే నిందితులను పట్టుకునేందుకు అవకాశం ఉంటుందన్నారు. సెల్‌ఫోన్ పోయిన వెంటనే ఫిర్యాదు చేయటంతోపాటు సీఈఐఆర్ పోర్టల్‌లో నమోదు చేయాలన్నారు. సైబర్ నేరాల నిరోధానికి 1930కి కాల్ చేయాలని లేదా సైబర్ క్రైమ్.జీవోవీ.ఇన్‌కు ఫిర్యాదు చేయాలని ఎస్పీ సూచించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ నక్కా సూర్యచంద్రరావు, త్రీటౌన్ సీఐ కోటేశ్వరరావు, ఎస్బీ సీఐ మల్లేశ్వరరావు, బీ.ఆదిప్రసాద్, సైబర్ క్రైమ్ ఎస్ఐ రాజా, తదితరులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

పట్టుబడిన మద్యం ధ్వంసం



భీమవరంలో ఎక్సైజ్ స్టేషన్ ఆవరణలో మద్యం ధ్వంసం చేస్తున్న దృశ్యం

భీమవరం: భీమవరం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కేసుల్లో పట్టుబడిన మద్యం సీసాలను మంగళవారం భీమవరం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఆవరణలో ధ్వంసం చేశారు. ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఆదేశాలతో మద్యం సీసాలను ధ్వంసం చేసినట్లు ఎక్సైజ్ సీఐ కె.బలరామరాజు చెప్పారు. గతంలో మద్యం కేసుల్లో పట్టుబడిన ఐదుగురిని భీమవరం తహసీల్దార్ ఆర్.రాంబాబు ముందు బైండోవర్ చేసినట్లు చెప్పారు.

ప్రశాంతంగా ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు

భీమవరం: ఇంటర్ సంప్లిమెంటరీ పరీక్షల్లో భాగంగా మంగళవారం ఫస్టియర్ ఇంగ్లీష్ పరీక్షకు 95 శాతం విద్యార్థులు హాజరయ్యారని ఇంటర్మీడియట్ జిల్లా విద్యాశాఖాధికారి ఎ.నాగేశ్వరరావు చెప్పారు. జనరల్ కేటగిరిలో 7,630 మందికి 7,320 మంది, ఒకేషనల్‌లో 444 మందికి 398 మంది హాజరయ్యారన్నారు. సెకండ్ ఇయర్ ఇంగ్లీషు పరీక్షకు 89 శాతం విద్యార్థులు హాజరుకాగా జనరల్ కేటగిరిలో 294 మందికి 270 మంది, ఒకేషనల్‌లో 102 మందికి 86 మంది హాజరయ్యారన్నారు.

మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి



అత్తిలిలో కుట్టు శిక్షణా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న హోంమంత్రి వంగలపూడి అనిత

అత్తిలి: మహిళలు తమ కాళ్ల మీద నిలబడి ఆర్థికాభివృద్ధి సాధించాలనే ధ్యేయంతో మహిళలకు కుట్టు శిక్షణ ఇస్తున్నట్లు హోంమంత్రి వంగలపూడి అనిత అన్నారు. అత్తిలిలో బీసీ సంక్షేమ ఫైనాన్స్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కుట్టు శిక్షణ కేంద్రాన్ని మంగళవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహిళల నైపుణ్యాభివృద్ధిని పెంపొందించడం కోసం కుట్టు శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చేశారన్నారు. పాలూరులో సీసీ రోడ్డు, రక్షిత మంచినీటి పథకాన్ని హోం మంత్రి ప్రారంభించారు. మైక్రో ఫిల్టర్‌లు, పైపులైన్ పనులకు శంకుస్థాపన చేసారు. అత్తిలిలో నిర్మించే రక్షిత మంచినీటి పథకం ట్యాంకు, పైపులైన్ విస్తరణకు భూమిపూజ చేశారు. కె సముద్రపుగట్టులో రక్షిత మంచినీటి పథకం, పైపులైన్‌లకు శంకుస్థాపన చేసారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ, ఏపీఐఐసీ చైర్మన్ మంతెన రామరాజు, ఎంపీపీ సుంకర నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సరస్వతి నది పుష్కరాలకు ప్రత్యేక బస్సు సర్వీస్

భీమవరం (ప్రకాశంచౌక్): ఈనెల 15 నుంచి జరిగే కాళేశ్వరం సరస్వతి నది పుష్కరాలకు భీమవరం డిపో నుంచి స్పెషల్ సర్వీసులు నడుపుతున్నట్లు డిపో మేనేజర్ పీ.ఎస్.వీ.ఎం.సత్యనారాయణ మూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. ఏదైనా గ్రామం నుంచి 35 మంది ప్రయాణికులు ఉంటే అదనపు చార్జీలు లేకుండా ఆ గ్రామం నుంచి మీరు కోరిన సమయంలో సూపర్ లగ్జరీ బస్సులు ఏర్పాటు చేస్తామన్నారు. టిక్కెట్ ధర ఒక్కొక్కరికీ రూ.2,200 అని.. మరిన్ని వివరాలకు 7382924754, 9666089036 నెంబర్లలో సంప్రదించాలన్నారు.

సీహెచ్‌ఓల సమస్యలు పరిష్కరించాలి



సీహెచ్‌ఓలకు మద్దతుగా మాట్లాడుతున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ బి.గోపీ మూర్తి


ఏలూరు (టూటౌన్): గత 20 రోజులు నుంచి నిరవధిక సమ్మె చేస్తున్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ల సమస్యలు వెంటనే పరిష్కరించాలని ఉభయగోదావరి జిల్లాల టీచర్స్ ఎమ్మెల్సీ బి.గోపిమూర్తి డిమాండ్ చేశారు. మంగళవారం ఏలూరు కలెక్టరేట్ వద్ద సమ్మె శిబిరాన్ని సందర్శించి సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ప్రభుత్వం తక్షణమే యూనియన్‌తో చర్చలు జరిపి సమస్యను పరిష్కరించి సమ్మె విరమణకు కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు.

వైభవంగా శ్రీచక్ర స్నానం

- నేత్రపర్వంగా తొళక్కం, అశ్వ వాహన సేవలు
- నేటితో ముగియనున్న బ్రహ్మోత్సవాలు



శ్రీచక్ర స్నానం జరుపుతున్న అర్చకులు



ఉభయ దేవేరులతో అశ్వ వాహనంపై ఊరేగింపు

ద్వారకాతిరుమల: శ్రీవారి వైశాఖమాస దివ్య బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని మంగళవారం శ్రీచక్ర స్నానాన్ని ఆలయ అర్చకులు వైభవంగా నిర్వహించారు. ముందుగా స్వామి, అమ్మవార్లు తొళక్క వాహనంపై క్షేత్ర పురవీధుల్లో ఊరేగారు. అనంతరం అర్చకులు ఆలయ యాగశాలలో శ్రీవారు, అమ్మవార్లు, శ్రీచక్ర పెరుమాళ్ల ఉత్సవ మూర్తులను ఒక వేదికపై వేంచేపు చేశారు. పూజాదికాల అనంతరం సుగంధ ద్రవ్యాలు, పంచపల్లవులు, శ్రీచందనం, పసుపు, మంత్ర పూత అభిషేక తీర్థంతో శ్రీచక్ర స్వామిని అభిషేకించారు. సాయంత్రం నిత్యహోమ బలిహరణలు, పూర్ణాహుతి, అనంతరం ధ్వజ అవరోహణ వేడుకలను అర్చకులు వేద మంత్రోచ్ఛరణలతో వైభవోపేతంగా నిర్వహించారు. ఆలయ ముఖ మండపంలో శ్రీవారి కాళీయమర్ధనం అలంకారం భక్తులకు కనువిందు చేసింది. రాత్రి అశ్వవాహనంపై తిరువీధి సేవను నిర్వహించారు. బుధవారం రాత్రి జరిగే శ్రీపుష్ప యాగోత్సవంతో స్వామివారి బ్రహ్మోత్సవాలు ముగుస్తాయి.

బ్రహ్మోత్సవాల్లో నేడు :

- ఉదయం 9 గంటల నుంచి – చూర్ణోత్సవం
- సాయంత్రం 6 గంటల నుంచి – కూచిపూడి నృత్య ప్రదర్శనలు
- రాత్రి 7 గంటల నుంచి – ద్వాదశ కోవెల ప్రదక్షిణలు, శ్రీపుష్ప యాగం-పవళింపు సేవ
- 9 గంటల నుంచి – రామాంజనేయ యుద్ధం నాటకం
- ప్రత్యేక అలంకారం : శయన మహావిష్ణువు

వాట్సాప్ గవర్నెన్స్ సద్వినియోగం చేసుకోవాలి



మనమిత్ర స్టాండ్‌లు అందచేస్తున్న కలెక్టర్ నాగరాణి

భీమవరం (ప్రకాశంచౌక్): మనమిత్ర వాట్సాప్ గవర్నెన్స్ సేవలు ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. మంగళవారం కలెక్టరేట్ వశిష్ట కాన్ఫరెన్స్ హాలులో కలెక్టర్ చేతుల మీదుగా మనమిత్ర స్టాండ్‌లు మండలాల వారీగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ ధ్రువపత్రాలు వాట్సప్ ద్వారానే ప్రజలు పొందేందుకు రాష్ట్ర ప్రభుత్వం మనమిత్రను అందుబాటులో తీసుకొచ్చిందన్నారు. సర్టిఫికెట్ల కోసం ప్రజలు ప్రభుత్వ కార్యాలయాలకు రాకుండానే, వాట్సాప్‌లోనే అప్లై చేసుకోవచ్చని అన్నారు. దేవదాయ, రెవెన్యూ, మున్సిపల్, తదితర శాఖలలో చెల్లింపులు, జనన, మరణాల ధ్రువీకరణ పత్రాలు, ట్రేడ్ లైసెన్సులు, వివిధ రకాల ధ్రువపత్రాలు జారీ సేవలు పొందవచ్చన్నారు. పౌరులకు లభించే సేవలపై ప్రజలకు సులభంగా అర్థమయ్యేలా అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో గ్రామ, వార్డు సచివాలయాల అధికారి వై.దోసి రెడ్డి, వివిధ మండలాల ఎంపీడీవో, మున్సిపల్ కార్యాలయాల సిబ్బంది, సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

జీవో 19తో ప్రభుత్వ పాఠశాలల నిర్వీర్యం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): జీవో నెంబర్ 19తో ప్రభుత్వ పాఠశాలలు నిర్వీర్యమవుతాయని ఆంధ్ర ప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ ఏలూరు జిల్లా శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు టి.రామారావు, బి.రెడ్డిదొర ఒక ప్రకటనలో ఆందోళన వ్యక్తం చేశారు. ఈ జీవో వల్ల మరింత మంది విద్యార్థులు ప్రైవేటు పాఠశాలల బాట పడతారని ఆందోళన వ్యక్తం చేశారు. ఉపాధ్యాయులపై పనిభారం పెరుగుతుందని మూడు రకాల పాఠశాలల వ్యవస్థలను అమలు చేయాలని కోరారు. ఉపాధ్యాయ, విద్యార్థి నిష్పత్తి పాఠశాలను బట్టి వేర్వేరుగా నిర్ణయించడం సరికాదని, వీటిని సరి చేయాలన్నారు. ఈ అసంబద్ధ పాఠశాలల వ్యవస్థ అమలుకు వ్యతిరేకంగా, ఉపాధ్యాయ విద్యార్థి నిష్పత్తి తగ్గించాలని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ ఇప్పటికే రెండు దశల్లో ఉద్యమం చేపట్టిందని, మే 14న మూడో దశ ఉద్యమంలో భాగంగా విజయవాడలో రాష్ట్ర స్థాయి లో ధర్నా కూడా నిర్వహించనున్నట్టు తెలిపారు.

కోకో రైతుకు సిండికేట్ దెబ్బ

- రోజురోజుకూ ధరల తగ్గింపు
- అంతర్జాతీయ మార్కెట్‌లో కిలోకు రూ.750కి పైగానే ధర
- స్థానికంగా రూ.450 మాత్రమే ఇస్తున్న వైనం
- ఈ ఏడాది ఫిబ్రవరి నుంచి నెలకు రూ.100 చొప్పున తగ్గుదల
- ఉమ్మడి జిల్లాలో 50 వేల ఎకరాల్లో కోకో సాగు



కోకో కాయలు (ఇన్‌సెట్‌లో) కోకో గింజలు

సాక్షి ప్రతినిధి, ఏలూరు : జాతీయ, అంతర్జాతీయ మార్కెట్‌లతో మాకు సంబంధం లేదు. మేం చెప్పిందే రేటు.. లేకపోతే ఏ కంపెనీ కోకో గింజలు కొనదు. ఇది కోకో వ్యాపారులు సిండికేట్ అయ్యి ఇస్తున్న అల్టిమేటం. అంతర్జాతీయ మార్కెట్‌లో కిలో గింజలు రూ.700 నుంచి రూ.800 పలుకుతుంటే ఏలూరు జిల్లాలో మాత్రం సిండికేట్ వ్యాపారుల వల్ల కేవలం రూ.450కే కొనుగోలు చేస్తున్నారు. రాష్ట్రంలోనే అత్యధిక కోకో సాగు ఏలూరు జిల్లాలోనే ఉంది. అంతర్జాతీయ మార్కెట్ ధరను ప్రామాణికంగా తీసుకుని గతేడాది వరకు అదే ధరలు చెల్లించిన వ్యాపారులు పూర్తిగా సిండికేట్ అయ్యి స్థానికంగా ధరలు నిర్ణయించడంతో కోకో రైతులు తీవ్ర సంక్షోభంలో పడ్డారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో 50 వేల ఎకరాల విస్తీర్ణంలో కోకో విస్తరించింది. కొబ్బరి, పామాయిల్‌లో అంతర్ పంటగా సాగుచేస్తున్నారు. 2018 నుంచి కోకో సాగు విస్తీర్ణం పెరుగుతూ వచ్చింది. ఏలూరు జిల్లాలో 2020లో 18,483 ఎకరాలు, 2021లో 20,350 ఎకరాలు ఉన్న కోకో సాగు, 2025 నాటికి 36,290 ఎకరాలకు చేరింది.

గతేడాది పోటీపడి కొనుగోలు

గతేడాది ఏప్రిల్, మే నెలలో కిలో కోకో గింజలు అత్యధికంగా రూ.1000కి పైగా పోటీ పడి మరీ కొనుగోలు చేశారు. గాలిలో తేమ శాతం అధికంగా ఉండటం ఇక్కడ కోకో సాగుకు భాగా కలిసివచ్చే అంశం. ఒక్క ఏలూరు జిల్లా నుంచే ఏటా 12 వేల మెట్రిక్ టన్నుల కోకో దిగుబడి ఉంది. గత మూడేళ్లుగా సగటున రూ.350 ధరతో ప్రారంభమై, 2024 ఏప్రిల్ నాటికి రూ.1040కి చేరింది. మరో 30 ఏళ్ల పాటు కోకోకు అంతర్జాతీయంగా డిమాండ్ ఉంది. దేశీయ అవసరాలకు ఏటా 1.10 లక్షల టన్నుల డిమాండ్ ఉన్నప్పటికీ దేశంలో 30 వేల మెట్రిల్ టన్నులు మాత్రమే ఉత్పత్తి అవుతోంది. మిగిలింది విదేశాల నుంచి దిగుమతి చేస్తున్నారు. రెండేళ్ల క్రితం వరకు రూ.40 వేల నుంచి రూ.50 వేల ఉన్న ఎకరం పొలం కౌలు ధర రూ.లక్ష నుంచి అత్యధికంగా రూ.1.20 లక్షలకు చేరింది. గతంలో నాణ్యతతో సంబంధం లేకుండా ఎలాంటి కోకో గింజలనైనా ఒకే ధరకు కొనుగోలు చేశారు. ఇప్పుడు వ్యాపారులు పూర్తిగా సిండికేట్‌గా మారి ఇష్టారీతిలో వ్యవహరిస్తున్నారు.

70 శాతం మండలీజ్ కంపెనీ కొనుగోలు


కోకో గింజలను స్థానంగా మండలీజ్, జిందాల్, హెరిటేజ్, డీపీ చాక్లెట్, సూర్య ట్రేడర్స్‌తో పాటు కొందరు వ్యాపారులు కొనుగోలు చేస్తుంటారు. వీటిలో 70 శాతానికి పైగా కొనుగోళ్లు మండలీజ్ కంపెనీ చేస్తుంది. అంతర్జాతీయ మార్కెట్‌లో ఈ వారం రూ.750 నుంచి రూ.800 ధరకు కోకోను కొనుగోలు చేస్తున్నారు. స్థానికంగా 5 నుంచి 10 శాతం వ్యత్యాసంలో అదే ధర చెల్లించాలి. వ్యాపారులు సిండికేట్‌గా మారి రూ. 450 ధరకు కొనుగోలు చేస్తున్నారు. అది కూడా ఈ ఏడాది జనవరిలో రూ.650తో ప్రారంభమైన లోకల్ మార్కెట్ ధర మే నాటికి రూ.450కు చేరింది. దీనిపై కోకో రైతు సంఘం పోరు బాట పట్టి కమిషనరేట్ ముట్టడి మొదలుకుని అనేక నిరసన కార్యక్రమాలు నిర్వహించింది.

కోకో రైతుల మొర పట్టని సర్కారు

గత నెలలో వ్యవసాయ శాఖ మంత్రి వద్ద సమావేశం నిర్వహించి, వ్యవసాయశాఖ మంత్రి అంతర్జాతీయ మార్కెట్ ధర చెల్లించాలని కోరింది. చివరకు కంపెనీలు రూ.550కు కొనుగోలు చేస్తాయని చెప్పి మాట తప్పారు.

దీంతో పాటు ఎంపిక చేసిన రైతుల వద్ద మాత్రమే కొనుగోలు చేయడం, పూర్తి ప్రాసెసింగ్ రైతే చేయాలని షరతులు విధించడం, అంతర్జాతీయ మార్కెట్ వర్తించదు, మేం ఇచ్చిన రేటే తీసుకోవాలని నిర్ణయించి మరీ మార్కెట్‌ను శాసిస్తున్నారు. దీంతో ఈ ఏడాది కోకో సాగుదారులు పూర్తిగా నష్టాల ఊబిలో కూరుకుపోయారు.


మాపై ఉదాసీనత ఎందుకు?



విజయరాయిలో 20 ఎకరాల్లో కోకో సాగు చేస్తున్నాను. సీజన్‌లో 100 గ్రాములకు 80 నుంచి 100 గింజలు వస్తాయి. అన్ సీజన్‌లో 100 గ్రాములకు 120 నుంచి 140 గింజలు వస్తాయి. రెండూ కలిపి సంక్రాంతి తరువాత అమ్ముకునే వాళ్ళం. హఠాత్తుగా ధర తగ్గించేశారు. ప్రస్తుతం రూ 350 నుంచి రూ.450 మధ్య కొనుగోలు చేస్తున్నారు. అంతర్జాతీయ మార్కెట్‌లో రూ.750 నుంచి రూ.800 వరకు కొనుగోలు చేస్తున్నారు.

– కొనేరు సతీష్‌బాబు, విజయరాయి

నష్టాల్లో మునిగిపోయాం



చిన్న సన్నకారు కోకో రైతులు నష్టాల్లో మునిగిపోయారు. గతేడాది రూ.1040 వరకు కోకోకు గిట్టుబాటు ధర ఇచ్చారు. నేడు రూ.400 మాత్రమే ఇస్తున్నారు. రైతులు చాలా పెట్టుబడి పెట్టారు. మండలీజ్ వ్యాపారస్తులందరూ సిండికేట్‌గా మారి రైతులను ముంచేశారు. మండలీజ్ కంపెనీ బయట వ్యాపారస్తులని రానివ్వకుండా చేసి, చిన్న రైతులకు నష్టం చేస్తున్నారు.

– వంకినేని లక్ష్మీనారాయణ, వంగూరు, లక్ష్మీపురం గ్రామం

రైతులు అప్రమత్తంగా ఉండాలి

కలెక్టర్ చదలవాడ నాగరాణి

భీమవరం(ప్రకాశంచౌక్): వాతావరణ శాఖ మే 14, 15 తేదీల్లో భారీ వర్షం కురవవచ్చన్న హెచ్చరికల నేపథ్యంలో రైతులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. కోస్తా, రాయలసీమలో ఈదురుగాలులతో కూడిన భారీ పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించిందని.. ఈ విషయంలో ప్రజలు, రైతులు ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని తెలిపారు. జిల్లా, డివిజన్, మండల స్థాయి అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. రైతులను అప్రమత్తం చేయాలని, వర్షాలు తగ్గేవరకు కోసిన ధాన్యాన్ని నిలువ చేసుకునేలా, కోయని వాటిని రెండు రోజులు వాయిదా వేసుకునేలా సమాచారాన్ని అందించాలన్నారు. ఇప్పటికే కోసిన ధాన్యం తడవకుండా ఎలా నిలువ చేసుకోవాలో అవగాహన కల్పించాలన్నారు.

క్లుప్తంగా

21 మంది ఎక్సైజ్ పాత నేరస్తుల బైండోవర్



నూజివీడు తహసీల్దార్ వద్ద హాజరైన ఎక్సైజ్ పాత నేరస్తులు

నూజివీడు: మండలంలోని దేవరగుంట, ఓగిరాల తండాలకు చెందిన ఎక్సైజ్ పాత నేరస్తులు 21 మందిని తహసీల్దార్ గుగులోతు భద్రూ నాయక్ ఎదుట హాజరుపరిచి బైండోవర్ చేసినట్లు ఎక్సైజ్ సీఐ ఏ మస్తానయ్య మంగళవారం తెలిపారు. దేవరగుంటకు చెందిన 19 మంది, ఓగిరాల తండాకు చెందిన ఇద్దరు వీరిలో ఉన్నారన్నారు. ఈ సందర్భంగా తహసీల్దార్ భద్రూ మాట్లాడుతూ ఏడాది పాటు బైండోవర్ అమలులో ఉంటుందని, ఈ సమయంలో ఎక్సైజ్ నేరాలకు పాల్పడినట్లయితే రూ.లక్ష వరకు జరిమానా విధించడం జరుగుతుందన్నారు.

ప్రమాదవశాత్తూ రైలు నుంచి జారిపడి మహిళ మృతి



కుమారి మృతదేహం

ఏలూరు టౌన్: ఏలూరు సత్రంపాడు ప్రాంతంలో ప్రమాదవశాత్తు రైలు నుంచి జారిపడి ఓ మహిళ మృతి చెందింది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. తూర్పుగోదావరి జిల్లా రాజానగరానికి చెందిన బొమ్మేతి కుమారి హైదరాబాద్‌లోని తన చెల్లిని చూసేందుకు తల్లిదండ్రులతో కలిసి సోమవారం రాత్రి ద్వారపూడిలో ట్రైన్ నెంబర్ 12737 గౌతమీ ఎక్స్‌ప్రెస్ ఎక్కారు. మహిళా కంపార్ట్‌మెంట్‌లో ప్రయాణిస్తున్న కుమారి రైలు బండి ఏలూరు సత్రంపాడు సమీపంలోకి వచ్చే సరికి ప్రయాణికుల రద్దీతో ప్రమాదవశాత్తు రైలునుంచి జారిపడింది. తీవ్ర గాయాలపాలైన ఆమెను 108 అంబులెన్స్‌లో ఏలూరు జీజీహెచ్‌కు తరలించారు. ఆమె చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందింది. ఏలూరు రైల్వే ఎస్సై పీ.సైమన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు జీజీహెచ్ మార్చురీకి తరలించారు.

అగ్ని ప్రమాదంలో రెండు తాటాకిళ్లు దగ్ధం



బాధితులకు ఆర్థిక సాయం అందజేస్తున్న తాండ్ర రాజేష్

కుక్కునూరు: అగ్ని ప్రమాదంలో రెండు తాటాకిళ్లు దగ్ధమయ్యాయి. బర్లమడుగు గ్రామంలో గుర్తు తెలియని వ్యక్తులు తాటి చెట్టుకు నిప్పంటించడంతో ఆ నిప్పు రవ్వలు ఎగసి గ్రామానికి చెందిన రేసు రాజు, సోయం బుల్లెమ్మ ఇళ్లపై పడడంతో అగ్నికి ఆహుతయ్యాయి. స్థానికులు ఫైర్ స్టేషన్‌కు సమాచారం అందించడంతో ఫైర్ సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేశారు. కాగా ఈ ప్రమాదంలో ఇంట్లో సామాన్లతో సహా అన్ని కాలి బూడిద కావడంతో బాధితులు కట్టు బట్టలతో మిగిలామని కన్నీటి పర్యంతమయ్యారు. బర్లమడుగు అగ్ని ప్రమాద బాధితులకు వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు తాండ్ర రాజేష్ ఒక్కో కుటుంబానికి రూ.5 వేలు చొప్పున రూ.10 వేల ఆర్థిక సహాయాన్ని అందించారు.

హద్దు మీరిన మట్టి దందా

- మట్టి ముసుగులో యథేచ్ఛగా ఎర్ర గ్రావెల్ తవ్వకాలు
- పోలవరం కాలువ గట్టుపై అడ్డగోలుగా తవ్వకాలు
- ఖద్దరు చొక్కా పెద్దలకు, ఉన్నతాధికారులకూ వాటాలు
- సాక్షి పరిశీలనలో బట్టబయలు



ద్వారకాతిరుమల మండలం ఎం.నాగులపల్లి వద్ద పోలవరం కాలువ గట్టుపై భూమిలో తవ్వకాలు



తవ్వకాలు జరిగిన ప్రాంతంలో ఉన్న వ్యక్తి



టిప్పర్‌లో తరలిపోతున్న గ్రావెల్ మట్టి

ద్వారకాతిరుమల: కూటమి నేతల అక్రమాలు హద్దులు మీరాయి. మట్టి ముసుగులో అడ్డగోలుగా ఎర్ర గ్రావెల్ అక్రమ తవ్వకాలకు పాల్పడుతున్నారు. అనుమతులు ఉన్నాయంటూ తమకు నచ్చిన చోట యథేచ్ఛగా తవ్వకాలు సాగిస్తూ కోట్లు గడిస్తున్నారు. ఈ మట్టి మాఫియాలో ఖద్దరు చొక్కా పెద్దలకు, కొందరు ఉన్నతాధికారులకు సైతం వాటాలు అందుతున్నాయని గుసగుసలు వినిపిస్తున్నాయి. ద్వారకాతిరుమల మండలంలోని పోలవరం కుడి కాలువ గట్టుపై జరుగుతున్న మట్టి దందాపై సాక్షి గ్రౌండ్ రిపోర్ట్.

మూడు పాయింట్లలో అనుమతులు

పంగిడిగూడెం వద్ద ఒక పాయింట్, ఎం.నాగులపల్లి వద్ద రెండు పాయింట్లలో తవ్వకాలకు ఇరిగేషన్, మైనింగ్ శాఖలు అనుమతులు ఇచ్చాయి. ఒక క్యూబిక్ మీటర్‌కు ఇరిగేషన్ శాఖకు జీఎస్టీతో కలిపి రూ.170, మైనింగ్ శాఖకు రూ.106 చెల్లించాల్సి ఉంది. అయితే భీమడోలు మండలం సూరప్పగూడెంకు చెందిన నవ్య ఎర్త్‌మూవర్స్ వారు ఇరిగేషన్ శాఖకు 2 వేల క్యూబిక్ మీటర్లకు నగదు చెల్లించగా మైనింగ్ శాఖకు మాత్రం వెయ్యి క్యూబిక్ మీటర్లకు మాత్రమే నగదు చెల్లించి అనుమతులు పొందారు. మిగిలిన వెయ్యి క్యూబిక్ మీటర్ల మట్టి ఏమైనట్టు. ఇదిలా ఉంటే ఏలూరుకు చెందిన లెవలప్ ప్రాజెక్ట్స్ వారు 2,500 క్యూబిక్ మీటర్లకు, కైకలూరు మండలం ఆటపాకకు చెందిన బీకేఎం కన్‌స్ట్రక్షన్స్ వారు 5 వేల క్యూబిక్ మీటర్లకు నగదు చెల్లించి అనుమతులు పొందారు.

అన్ని రోజులు అనుమతి ఎందుకో..

రోజుకి ఒక్కో పాయింట్ నుంచి 70 నుంచి 80 టిప్పర్ల గ్రావెల్ మట్టి బయటకు వెళుతోంది. ఒక్కో టిప్పర్‌లో 15 క్యూబిక్ మీటర్ల మట్టి పడుతుంది. దీన్ని బట్టి నవ్య ఎర్త్ మూవర్స్ వెయ్యి క్యూబిక్ మీటర్ల మట్టిని 67 ట్రిప్పుల్లో, లెవలప్ ప్రాజెక్ట్స్ 2,500 క్యూబిక్ మీటర్ల మట్టిని 167 ట్రిప్పుల్లో, బీకేఎం కన్‌స్ట్రక్షన్స్ 5 వేల క్యూబిక్ మీటర్ల మట్టిని 334 ట్రిప్పుల్లో తోలుకోవాలి. ఇందులో ఒకరికి 30 రోజులు, ఇంకొకరికి 40, మరొకరికి 90 రోజుల పాటు అనుమతులు ఇచ్చారు. వెయ్యి క్యూబిక్ మీటర్లు (67 టిప్పర్లు)మట్టిని 30 రోజులు తోలుకోవడానికి మైనింగ్ అధికారులు అనుమతులు ఇవ్వడం హాస్యాస్పదంగా ఉంది.

రైతుల ప్రాణాలతో చెలగాటాలు

అనుమతులు పొందిన పాయింట్లలో కాకుండా తమకు నచ్చిన పాయింట్లలో మట్టిని తవ్వేస్తున్నారు. అది కూడా గట్టుపై ఉన్న మట్టిని కాకుండా, అక్కడే తాడి చెట్టు లోతున భూమిని తవ్వి, ఎర్ర గ్రావెల్‌ను అమ్ముకుంటున్నారు. ఇటీవల ఎం.నాగులపల్లి వద్ద కొందరు రైతులు ఈ తవ్వకాలను అడ్డుకుని, ఓ కంపెనీ వ్యక్తిని నిలదీశారు. అయితే తవ్వకాలు పూర్తయ్యాక పూడ్చి వెళతామని సమాధానమిచ్చి వారిపని వారు చేసుకోవడం మొదలు పెట్టారు. గట్టిగా అడిగితే కూటమి నేతలు ఏం చేస్తారోనన్న భయంతో వారు నిమ్మకుండిపోయారు. అధికారులకు ఫిర్యాదు చేస్తుంటే వారికి అనుమతులు ఉన్నాయంటున్నారని, తవ్వకాలు జరిగిన ప్రాంతాలను అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలిస్తే తమ బాధ అర్థమవుతుందని అంటున్నారు. గ్రావెల్ తవ్వకాలు జరుగుతుంటే అధికారులు ఏం చేస్తున్నారో చెప్పాలని ప్రశ్నిస్తున్నారు.

ఖద్దరు చొక్కా పెద్దలకూ వాటాలు

ఇరిగేషన్, మైనింగ్ శాఖల అధికారులు సంయుక్తంగా పరిశీలించి, హద్దులను నిర్ణయించి, రాళ్లు పాతిపెట్టిన తరువాత ఆ పరిధిలో మాత్రమే తవ్వకాలు జరపాలి. అయితే ఆ నిబంధనలేవీ ఇక్కడ అమలు కాలేదు. ఈ తవ్వకాల్లో ఖద్దరు చొక్కా పెద్దలకు, అధికారులకు వాటాలు ఉండటమే కారణంగా తెలుస్తోంది.

క్యాష్ చేసుకుంటున్న నేతలు

ఎర్ర గ్రావెల్‌కు మంచి డిమాండ్ ఉండటంతో నేతలు క్యాష్ చేసుకుంటున్నారు. కాలువ పక్కన సమాంతరంగా మరో కాలువలా ఎర్ర గ్రావెల్ తవ్వకాలు జరుపుతున్నారు. టిప్పర్ గ్రావెల్ మట్టిని దూరాన్ని బట్టి రూ.7 నుంచి 12 వేలకు విక్రయించి, సొమ్ము చేసుకుంటున్నారు. కైకలూరు–పామర్రు హైవేకి, చుట్టుపక్కల ప్రాంతాల్లోని రియల్ ఎస్టేట్ వెంచర్ల చదునుకు ఈ గ్రావెల్‌ను తరలిస్తున్నారు.

పరిశీలిస్తాం..

కాలువ గట్టుపై గ్రావెల్ తవ్వకాలు జరుగుతున్నట్టు, తమ దృష్టికి రాలేదని ఇరిగేషన్ ఏఈ బాపూజీ తెలిపారు. వెంటనే పరిశీలిస్తామని చెప్పారు.

మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య

జంగారెడ్డిగూడెం: మనస్తాపంతో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. హెచ్‌సీ ఎస్.ఉమామహేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం శ్రీనివాసపురానికి చెందిన రాజులపాటి అప్పారావు, ప్రియాంకలకు వివాహమై ఇద్దరు పిల్లలు ఉన్నారు. అప్పారావు చికెన్ షాపు పెట్టి జీవనం సాగిస్తున్నాడు. మద్యానికి బానిసైన అప్పారావును ప్రియాంక పలుమార్లు వారించి, పెద్దలలో సైతం పెట్టినా అతడు మద్యాన్ని విడిచిపెట్టలేదు. దీంతో 15 రోజుల క్రితం పిల్లలను తీసుకుని ప్రియాంక అక్కంపేటలోని తన పుట్టింటికి వెళ్లిపోయింది. అప్పారావు ఎన్నిసార్లు ఫోన్‌చేసినా ఆమె రాకపోవడంతో మనస్తాపానికి గురై ఇంట్లోని ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. భార్య ప్రియాంక ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు హెచ్‌సీ తెలిపారు.

డివైడర్‌ను ఢీకొన్న ట్రాక్టర్.. డ్రైవర్ మృతి



డివైడర్‌ను ఢీకొన్న ట్రాక్టర్

పెదవేగి: ట్రాక్టర్ అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొన్న ఘటనలో డ్రైవర్ మృతి చెందాడు. ఎస్సై కె రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం భోగాపురం గ్రామానికి చెందిన మట్టా నాగరాజు (36) మంగళవారం ఉదయం స్వగ్రామం నుంచి దుగ్గిరాల ట్రాక్టర్‌పై వెళుతుండగా అమ్మపాలెం జాతీయ రహదారి సమీపంలో ప్రమాదవశాత్తు డివైడర్‌ను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో ట్రాక్టర్‌పై నుంచి నాగరాజు రోడ్డు మీద పడిపోవడంతో తలకు తీవ్రగాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రామకృష్ణ చెప్పారు. మృతదేహాన్ని శవపంచనామా అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతుడు నాగరాజుకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

● మండే సూరీడు సైతం చిన్నబోయేలా..



ఆకివీడు ప్రధాన సెంటర్‌లో తాటి ముంజులు విక్రయిస్తున్న దృశ్యం

భానుడి భగభగలను తట్టుకోలేక ప్రజలు అల్లాడుతున్నారు. సాయంత్రం వరకు ఇంటి నుంచి బయటకు వచ్చేందుకు సైతం జంకుతున్నారు. అయితే ఇంటిలోనే కూర్చుంటే కొందరికీ పూట గడవని పరిస్థితి. మండుటెండను సైతం లెక్కచేయకుండా రోడ్డుపై తాటి ముంజులు విక్రయిస్తూ జీవనం గడుపుతున్నారు. ఆకివీడు ప్రధాన సెంటర్‌లో మండే ఎండల్లో తాటి ముంజులు విక్రయించే పనిలో కొందరు నిమగ్నమైన దృశ్యమిది.

– ఆకివీడు

వాహనంలో రేడియేటర్ పేలి బాలికకు గాయాలు



మూసుకుపోయిన పాల వాహనం డోర్‌లను తెరుస్తున్న స్థానికులు, భక్తులు



కాలిన గాయంతో రోదిస్తున్న బాలిక

ద్వారకాతిరుమల: శ్రీవారి కొండపైన జంటగోపురాల ప్రాంతంలో మంగళవారం ఓ భక్తుడి పాల వాహనంలోని రేడియేటర్ పేలి అందులోని బాలికకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం. దెందులూరు మండలం పోతునూరుకు చెందిన ఒక వ్యక్తి సెకండ్ హ్యాండ్ పాల వ్యాన్‌ను కొనుగోలు చేశాడు. దానికి పూజలు చేసేందుకు భార్య, ఇద్దరు పిల్లలతో కలసి శ్రీవారి క్షేత్రానికి వచ్చాడు. ఘటనా స్థలం వద్దకు వచ్చేసరికి వాహనంలోని రేడియేటర్ ఒక్కసారిగా పేలింది. దాంతో బాలికపై రేడియేటర్‌లోని వేడి నీరు పడి ఆమెకు గాయాలయ్యాయి. ఆ సమయంలో వాహనం డోర్‌లు తెరచుకోక పోవడంతో అందులో ఉన్న వారంతా పెద్దపెద్ద కేకలు వేశారు. దాంతో స్థానికులు, భక్తులు వాహనం వద్దకు చేరుకుని, ఎంతగానో శ్రమించి డోర్‌లు తెరిచారు. గాయపడిన బాలికను ఆలయ ఆవరణలోని ప్రథమచికిత్సా కేంద్రానికి తరలించి, కాలికి చికిత్స చేయించారు.

ఏజెన్సీలో స్పెషల్ డీఎస్సీ నిర్వహించాలి

ఏలూరు (టూటౌన్): ఏజెన్సీలో జీవో నంబర్ 3 పునరుద్ధరణకు ఆర్డినెన్స్ తెచ్చి స్పెషల్ డీఎస్సీ నిర్వహించాలని, అప్పటివరకు ఏజెన్సీలో డీఎస్సీ రిక్రూట్‌మెంట్ వాయిదా వేయాలని సీపీఎం ఏలూరు జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. స్థానిక సీపీఎం జిల్లా కార్యాలయంలో ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఎ.రవి మంగళవారం మాట్లాడారు. కేవలం ఏజెన్సీ ప్రాంత గిరిజనులకు 100 శాతం రిజర్వేషన్ కల్పించడం తప్ప మరో ఆప్షన్ లేదని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి ఎన్నికల సందర్భంగా, ఇటీవల అరకు వచ్చిన సందర్భంగా జీవో నెంబర్ 3ని పునరుద్ధరిస్తామని ఇచ్చిన హామీని తక్షణమే నిలబెట్టుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. అందుకు అనుకూలంగా సాంకేతిక లోపాలను సవరించి పాత జీవో స్థానంలో కొత్త ఆర్డినెన్స్ తీసుకురావాలని ఆయన కోరారు. దరఖాస్తు గడువు ఈ నెల 15 తో ముగియనున్నందున ఈ సమస్యను అత్యవసరంగా భావించి చర్యలు తీసుకోవాలన్నారు. ఏజెన్సీ ప్రాంత నిరుద్యోగులకు న్యాయం జరగని పక్షంలో ఉద్యమాన్ని ఉధృతంగా నిర్వహిస్తామని రవి ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

బైండోవర్ ఉల్లంఘించిన వ్యక్తికి జరిమానా

ఆగిరిపల్లి: బైండోవర్ ఉల్లంఘించిన వ్యక్తికి తహసీల్దార్ ప్రసాద్ రూ.లక్ష జరిమానా విధించారు. ఎక్సైజ్ సీఐ మస్తానయ్య తెలిపిన వివరాల ప్రకారం గతంలో తహసీల్దార్ ఎదుట బైండోవర్ అయినా ఆగిరిపల్లికి చెందిన యండురి అప్పారావు మళ్లీ నాటుసారా తయారీదారులకు అక్రమంగా బెల్లం విక్రయిస్తూ ఎక్సైజ్ అధికారులకు పట్టుబడ్డాడు. నిబంధనలు ఉల్లంఘించినందుకు అప్పారావుకు తహసీల్దార్ ప్రసాద్ రూ.లక్ష జరిమాను విధించినట్లు సీఐ చెప్పారు.

డీఎంహెచ్‌వోకు వినతి



డీఎంహెచ్‌వో డాక్టర్ మాలినికి వినతి పత్రం అందజేస్తున్న ప్రైవేట్ ల్యాబ్ టెక్నీషియన్లు

ఏలూరు టౌన్: ఏలూరు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ పేరుతో ఒక వ్యక్తి అనధికార దందాలకు పాల్పడుతున్నారని, చర్యలు తీసుకోవాలని కోరుతూ మంగళవారం ప్రైవేట్ ల్యాబ్ టెక్నీషియన్స్ అసోసియేషన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో డీఎంహెచ్‌వో డాక్టర్ మాలినికి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తామంతా ల్యాబ్ టెక్నీషియన్ కోర్స్ చదువుకొని, వైద్య ఆరోగ్య శాఖ పరిధిలో ప్రైవేట్ ల్యాబ్‌లు నిర్వహించుకుంటూ జీవనం గడుపుతున్నామన్నారు. అయితే గత కొంత కాలంగా 70326 72067 నెంబర్ తో కాల్ చేస్తూం. మేము జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆఫీసు నుంచి మీనాక్షి నీ మాట్లాడుతున్నాను.. మీ లాబ్ పై మాకు కంప్లయింట్ వచ్చింది.. ఈ ఫిర్యాదును జిల్లా ఉన్నతాధికారులకు పంపమంటారా లేదా.. సెటిల్ చేసుకుంటారా అంటూ బెదిరింపులకు పాల్పడుతున్నారని తెలిపారు. రూ.20,000 చెల్లిస్తే సమస్య పరిష్కారం అవుతుందని డిమాండ్ చేస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. వీటిపై విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏలూరు జిల్లా ప్రైవేట్ ల్యాబ్ టెక్నీషియన్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎంఎస్వి ప్రసాద్, ప్రధాన కార్యదర్శి కొసరాజు శ్రీ నాగ సతీష్, కోశాధికారి సత్యకుమార్, సభ్యులు సురేష్, హరికృష్ణ, దుర్గారావు, శ్రీనివాసరావు, వెంకటేశ్వరరావు, సింహాద్రి ఉన్నారు.

ఏలూరులో సింగిల్ చిత్ర బృందం సందడి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సింగిల్ చిత్రం హీరో శ్రీవిష్ణు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): గీత ఆర్ట్స్ బ్యానర్‌పై తెరకెక్కిన సింగిల్ చిత్ర బృంద సభ్యులు మంగళవారం ఏలూరులో సందడి చేశారు. హీరో శ్రీ విష్ణు, హీరోయిన్లు కేతిక శర్మ, ఇవానా నటించిన సింగిల్ చిత్రం ఇటీవల విడుదలై విజయవంతంగా ప్రదర్శితమౌతున్న నేపథ్యంలో చిత్ర బృందం నగరంలోని ఎస్‌వీసీ థియేటర్‌లో ప్రేక్షకులను కలిసి తమ సంతోషాన్ని పంచుకున్నారు. ఈ సందర్భంగా చిత్రంలోని డైలాగులను చెప్పి ప్రేక్షకులను ఉర్రూతలూగించారు. తమ చిత్రాన్ని ఆదరించి విజయవంతం చేసిన ప్రేక్షకులకు చిత్ర యూనిట్ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో హీరో శ్రీ విష్ణు, దర్శకుడు కార్తీక్ రాజు మాట్లాడారు. మంచి కామెడీతో పాటు కుటుంబ సమేతంగా చూసే విధంగా చిత్రాన్ని రూపొందించినట్లు తెలిపారు. సమావేశంలో హాస్య నటుడు వెన్నెల కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

కడుపునొప్పి తాళలేక..

పెదవేగి: కడుపునొప్పిని భరించలేక ఓ వివాహిత ఆత్మహత్యకు పాల్పడింది. ఎస్సై కె రామకృష్ణ తెలిపిన వివరాలివి. జానంపేట పంచాయతీ ప్రకాష్‌నగర్‌కు చెందిన వివాహిత వల్లి ఏసమ్మ గ్యాస్ నొప్పితో వచ్చిన కడుపు నొప్పిని భరించలేక ఈనెల 12న ఉదయం పురుగుల మందు తాగేసింది. ఈ విషయాన్ని గమనించిన స్థానికులు, కుటుంబ సభ్యులు ఆమెను ఏలూరు సర్వజన ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఏసమ్మ మంగళవారం మృతి చెందింది. భర్త కిషోర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు.

సబ్సిడీ రుణాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఏలూరు (టూటౌన్): 2025–2026 ఆర్థిక సంవత్సరంలో వ్యక్తిగత సబ్సిడీ రుణాల కోసం అర్హులైన మైనారిటీ (ముస్లిం, క్రైస్తవులు, బుద్ధులు, జైనులు, సిక్కులు, పార్సీలు) అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి ఎస్ఎస్ కృపావరం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆన్‌లైన్‌లో జ్ట ఇటు://్రజొ ఖు ఝుట,్ర ఇధిజటట.జీ ు/ సైట్ ద్వారా స్వతహాగా గాని లేదా మీసేవ ద్వారాగాని దరఖాస్తులను పంపాలన్నారు. వివరాలకు మైనారిటీస్ ఫైనాన్స్ కార్పొరేషన్, కలెక్టరేట్ కాంపౌండ్, ఏలూరు లేదా ఫోన్ నెంబర్: 08812–242463లో సంప్రదించాలన్నారు.

రామన్నగూడెం పంచాయతీ నిధుల దుర్వినియోగంపై విచారణ పూర్తి

ద్వారకాతిరుమల: మండలంలోని రామన్నగూడెం పంచాయతీలో నిధుల దుర్వినియోగంపై అధికారుల విచారణ పూర్తయ్యింది. వివరాల్లోకి వెళితే.. స్థానిక పంచాయతీలో రూ.20 లక్షల మేర నిధులు దుర్వినియోగం జరిగినట్టు పంచాయతీ 8వ వార్డు సభ్యుడు పాకలపాటి భద్రరావు గతంలో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాడు. తీర్మానాల్లో వార్డు సభ్యుల సంతకాలను ఫోర్జరీ చేసి, నిధులను స్వాహా చేశారని, దీనిపై పూర్తిస్థాయి విచారణ జరిపి, బాధ్యులపై తగు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నాడు. దీనిపై ఉప మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఏవీ సుబ్బరాయన్ ఈనెల 8న పంచాయతీ కార్యాలయంలో విచారణ జరిపారు. ఈ విచారణకు గ్రామ సర్పంచ్ నంగెడ్ల జ్యోతి, ఫిర్యాదిదారుడు పాకలపాటి భద్రరావు, 6వ వార్డు సభ్యుడు పాకలపాటి మాణిక్యాలరావు, పూర్వపు పంచాయతీ కార్యదర్శులు కె.నాగరాజు, కె.కృష్ణవేణి హాజరయ్యారు. ఈ సందర్భంగా సుబ్బరాయన్ సంబంధిత రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. నివేదికను 7 రోజుల్లోగా ఉన్నతాధికారులకు సమర్పిస్తానని ఆయన తెలిపారు.

ఎండు గడ్డి ప్రియం

- పశుగ్రాసం లభించక పాడి రైతుల ఇబ్బందులు
- యంత్రాలతో వరికోతలే ప్రధాన కారణమంటూ ఆవేదన
- ఎండు గడ్డి ధర చూసి ఆందోళన



ఉప్పులూరులో ట్రాక్టర్‌లపై ఎండుగడ్డిని తరలిస్తున్న దృశ్యం

ఉండి: వ్యవసాయం అధునాతన సాంకేతిక వైపు అడుగులు వేస్తుండడం రైతులకు వరం కాగా పాడి రైతులకు మాత్రం శాపంగా పరిణమించింది. వరికోతల్లో ఎక్కువగా యంత్రాలనే వినియోగిస్తుండడంతో పశుగ్రాసం లభించక పాడి రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గతంలో కూలీలు వరికోతలను కోయడం వలన కుప్పనూర్పులు చేసి ఎండుగడ్డిని జాగ్రత్త చేసి పశువులకు మేత వేసేవారు. ప్రస్తుతం యంత్రాలతో కోతకోసిన తరువాత ఆ వరి గడ్డి పిప్పిలా మారుతుండడంతో పశువులు తినేందుకు ఆసక్తి కనబరచడం లేదు. దీంతో ఎండుగడ్డి కొరత ఏర్పడింది. ఈ నేపథ్యంలో ఎక్కడా ఎండుగడ్డి దొరుకుతుందా అని రైతులు వెదికి అధిక ధర చెల్లించి మరీ కొనుగోలు చేసేందుకు పోటీ పడే పరిస్థితి నెలకొంది. దీంతో ఎండుగడ్డి ధర విపరీతంగా పెరిగింది. గతంలో ఎకరాకు రూ.వెయ్యి నుంచి రూ.2 వేలు వరకు పలుకగా ప్రస్తుతం రూ.5 వేల నుంచి రూ.7 వేల వరకు పలుకుతుంది. డెల్టా ప్రాంతం నుంచి అధిక ధరలకు కొని మధ్యవర్తులు మరింత ఎక్కువ ధరకు ఇతర ప్రాంతాల్లో విక్రయిస్తుండటంతో ఎండు గడ్డి మరింత ప్రియంగా మారింది. ముఖ్యంగా మెట్ట ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో మధ్యవర్తులు ఎండుగడ్డిని కొనేందుకు పోటీపడతున్నారు. మార్టేరు తదితర ప్రాంతాల్లో ఫారంలు అధికంగా ఉండడంతో ఆ ప్రాంతాల్లో ఎకరా ఎండుగడ్డి రూ.5 వేల ధర పలుకుతుండటంతో పశువుల రైతులు ఘొల్లుమంటున్నారు.

సబ్సిడీపై దాణాను అందజేయాలి

గతంలో ఎక్కడబడితే అక్కడ దొరికే ఎండుగడ్డి ఇప్పుడు చాలా అరుదుగా లభిస్తోంది. ప్రభుత్వం పశువుల దాణాను అధిక సబ్సిడీపై అందజేసి పాడి రైతులను ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

పాడి రైతులకు ఇబ్బందులు



పశువులకు మేత వేసేందుకు ఎండుగడ్డి దొరక్క పాడి రైతులు నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రాష్ట్ర ప్రభుత్వం పశువుల దాణాను సబ్సిడీపై అందజేసి పాడి రైతులను ఆదుకోవాలి. అంతే కాకుండా ప్రభుత్వం కూడా ఎండుగడ్డిని సేకరించి పాడిపరిశ్రమ అభివృద్ధి చెందేలా చర్యలు చేపట్టాలి.

– పీవీఆర్‌కే ఆంజనేయరాజు, రైతు, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు, వాండ్రం

ప్రభుత్వం ఆదుకోవాలి



ప్రస్తుతం ఎండుగడ్డికీ చాలా గిరాకీ ఏర్పడింది. గతంలో రూ.వెయ్యి నుంచి రూ.2 వేలు ఉండే ఎకరా ఎండుగడ్డి ప్రస్తుతం ఏరియాను బట్టి రూ.5 వేల నుంచి రూ.7 వేల వరకు పలుకుతోంది. దీంతో పాడి రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రాష్ట్ర ప్రభుత్వం పాడి రైతులను ఆదుకోవాలి.

– నిమ్మల కేశవకుమార్, రైతు, ఉప్పులూరు, ఉండి మండలం

పశువులకు మేత కష్టంగా ఉంది



పశువులకు మేత వేసేందుకు ఎండుగడ్డి దొరకడం లేదు. ప్రభుత్వం జోక్యం చేసుకొని ఎండుగడ్డిని పాడిరైతులకు అందజేయాలి. పాడిని మనం బతికించుకుని ఆరోగ్యమైన పాలుతాగడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యంతో నిండునూరేళ్లు జీవిస్తాం. పాడిరైతులకు రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలవాలి.

వర్రే పైడియ్య, రైతు, పాములపర్రు, ఉండి మండలం

క్లుప్తంగా

ఘనంగా పల్లాలమ్మ అమ్మవారి జాతర



విశేష అలంకరణలో పల్లాలమ్మ అమ్మవారు

అత్తిలి: మండలంలోని మంచిలి గ్రామ దేవత పల్లాలమ్మ అమ్మవారి జాతర మహోత్సవం మంగళవారం ఘనంగా జరిగింది. ఉత్సవాలు సందర్భంగా అమ్మవారి ఆలయాన్ని పుష్పాలతో విశేషంగా అలంకరించారు. పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. ఈసందర్భంగా గ్రామంలో ఆసాదుల గరగ నృత్యాలు, డప్పువాయిద్యాలు, బాణాసంచా కాల్పుల నడుమ అమ్మవారి ఊరేగింపు ఉత్సవాన్ని వైభంగా జరిపారు. అమ్మవారి ఆలయం వద్ద జాతర మహోత్సవం సందర్భంగా పలు దుకాణాలు వెలిశాయి.

వైద్య శిబిరానికి 32 మంది వృద్ధులు హాజరు



ఉచిత వైద్యసేవలందిస్తున్న దృశ్యం

తణుకు అర్బన్: సజ్జాపురం సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. స్థానిక రాష్ట్రపతి రోడ్డులోని అసోసియేషన్ కార్యాలయంలో నిర్వహించిన శిబిరానికి హాజరైన 32 మంది వృద్ధులకు సీనియర్ వైద్యులు డాక్టర్ భూపతిరాజు రమేష్‌చంద్రబాబు వైద్యసేవలందించారు. అనంతరం ఆహార అలవాట్లు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. హాజరైన వృద్ధులకు బీపీ, సుగర్ పరీక్షలు నిర్వహించి పేద వృద్ధులకు ఉచితంగా మందులు పంపిణీ చేసినట్లు అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు అద్దాల సత్యనారాయణ తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు కాయల నాగేశ్వరరావు, జిల్లా సభ్యులు ఇవటూరి లక్ష్మణరావు, చేబ్రోలు సాధు పాల్గొన్నారు.


200 మందికి కంటి వైద్య పరీక్షలు



మీనవిల్లూరు ఏసయ్య ప్రార్థనా మందిరంలో వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

పెంటపాడు: మండలంలోని మీనవిల్లూరు రామకృష్ణ సేవాట్రస్టు ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత కంటి వైద్యపరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంతో పాటు, చుట్టుపక్కల గ్రామాలకు చెందిన సుమారు 200 మంది కంటి వైద్యపరీక్షలు చేయించుకొన్నారు. పలువురిని ఆపరేషన్ నిమిత్తం నిడదవోలు ట్రస్టు ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. పలువురికి పరీక్షలు చేసి అవసరమైనవారికి కళ్లజోళ్లు రాయితీపై పంపిణీ చేశారు. ట్రస్టు వ్యవస్థాపకుడు పాస్టర్ డీఆర్కే మోజస్ (డీవీ కృష్ణ), నిడదవోలు రాజేశ్వరి, రామకృష్ణ లయన్స్ కంటి వైద్యులు పాల్గొన్నారు.

సీబీఎస్ఈ ఫలితాల్లో సత్తా



జాహ్నవి (481 మార్కులు)

తాడేపల్లిగూడెం రూరల్: సీబీఎస్ఈ పదో తరగతి ఫలితాల్లో తాడేపల్లిగూడేనికి చెందిన సీహెచ్ జాహ్నవి అనే విద్యార్థిని 500కు గాను 481 మార్కులు సాధించి సత్తా చాటింది. ఆమె పెదతాడేపల్లి లోటస్ ఇంగ్లిష్ మీడియం స్కూలులో విద్యనభ్యసించినట్టు ప్రిన్సిపాల్ బి.దేవీప్రియ మంగళవారం తెలిపారు. తమ పాఠశాలలో 111 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 29 మంది 400కు పైగా మార్కులు సాధించారని చెప్పారు. ఈ సందర్భంగా ప్రతిభ చాటిన విద్యార్థులను అభినందించారు.

సీబీఎస్ఈలో బెల్‌వెదర్ విద్యార్థుల ప్రతిభ



నాగకార్తీకను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ వినీత

తణుకు అర్బన్: సీబీఎస్ఈ పదో తరగతి పరీక్షా ఫలితాల్లో తణుకు బెల్‌వెదర్ ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ చాటారు. పి.నాగకార్తీక అనే విద్యార్థిని 500 మార్కులకు గాను 481 సాధించి టౌన్ ఫస్ట్‌గా నిలిచిందని పాఠశాల డైరెక్టర్ అద్దంకి దీపక్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. తమ పాఠశాల నుంచి పరీక్షకు హాజరైన విద్యార్థులంతా ఉత్తీర్ణత సాధించారని వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులను పాఠశాల ప్రిన్సిపాల్ కె.వినీత, ఉపాధ్యాయులు అభినందించారు.

రోడ్ల మలుపులు.. ప్రమాదాలకు పిలుపులు



అత్తిలి- అలంపురం మార్గంలో ప్రమాదకరంగా ఉన్న మలుపు



అత్తిలి మండలం మంచిలి వద్ద ప్రమాదకర మలుపు

- కానరాని హెచ్చరిక బోర్డులు
- ఆదమరిస్తే అంతే సంగతులు
- భయాందోళనతో వాహనదారుల ప్రయాణం



అత్తిలి మండలం బల్లిపాడుమార్గంలో మలుపువద్ద డ్రెయిన్‌లోకి దూసుకెళ్లిన కారు(ఫైల్)

అత్తిలి: ఆర్‌అండ్‌బీ రహదారులపై ఉన్న ప్రమాదకర మలుపులు ప్రమాదాలకు నిలయంగా మారాయి. మలుపుల వద్ద ఎదురుగా వస్తున్న వాహనాలు కనిపించక అదుపుతప్పి ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈరోడ్డు ప్రమాదాలలో ప్రయాణికులు క్షతగాత్రులు అవుతున్నారు. తణుకు-భీమవరం మార్గంలో అత్యధిక మలుపులు ప్రమాదకరంగా ఉన్నాయి. వీటిలో అత్తిలి మండలం కె సముద్రపుగట్టు, మంచిలి, పాలూరు, ఈడూరు, కంచుమర్రు, స్కిన్నెరపురం గ్రామాల పరిధిలో మలుపుల వద్ద ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. అత్తిలి- అలంపురం, ఉరదాళ్లపాలెం-దువ్వ ఆర్‌అండ్‌బీ రహదారులపై ఉన్న మలుపుల వద్ద తరచు ప్రమాదాలు జరిగి ప్రయాణికులు గాయాల పాలౌతున్నారు. జనవరిలో బల్లిపాడు సమీపంలో ఉన్న మలుపువద్ద కారు వేగంగా వచ్చి మలుపు గుర్తించక పక్కనే ఉన్న మురుగుడ్రెయిన్‌లోకి దూసుకెళ్లింది. ఇదే ప్రాంతంలో వారం వ్యవధిలో రెండు పర్యాయాలు కారు ప్రమాదాలు జరిగాయి. ఈమలుపుల వద్ద ఎటువంటి హెచ్చరిక బోర్డులు కానీ, స్పీడ్ బ్రేకర్‌లు లేక పోవడంతో ఈప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ముఖ్యంగా ఈమార్గంలో దువ్వ దానేశ్వరి అమ్మవారి ఆలయానికి పెద్ద సంఖ్యలో భక్తులు వాహనాలపై వస్తుంటారు. కొన్ని మలుపుల వద్ద రోడ్డు వెంబడి చెట్లు, ముళ్ల పొదలు అల్లుకుపోవడంతో ఎదురుగా వచ్చేవాహనాలు కనిపించక రోడ్డు ప్రమాదాలు సంభవిస్తున్నాయి. ముఖ్యంగా రాత్రిసమయాలలో మలుపుల వద్ద అనేక మంది ప్రయాణికులు అదుపుతప్పి జారిపడి క్షతగాత్రలు అయిన సంఘటనలు అనేకం జరిగాయి. ఆర్‌అండ్‌బీ శాఖ అధికారులు ప్రమాదకర మలుపుల వద్ద హెచ్చరిక బోర్డులు స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేసి, ప్రమాదాలను నివారించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

కొత్త రేషన్ కార్డులకు దరఖాస్తుల స్వీకరణ



తహసీల్దార్ ఎం.సునీల్ కుమార్

తాడేపల్లిగూడెం రూరల్: కొత్త రేషన్ కార్డుల కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తహసీల్దార్ ఎం.సునీల్ కుమార్ తెలిపారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ సునీల్ కుమార్ మాట్లాడుతూ అవసరమైన ధ్రువీకరణ పత్రాలు సమర్పిస్తే 21 రోజుల్లో దరఖాస్తులు ధ్రువీకరించబడతాయన్నారు. సచివాలయంలోని డిజిటల్ అసిస్టెంట్లు ఎవరికీ ఎటువంటి సమస్య లేకుండా సహకరిస్తారన్నారు. ప్రస్తుతానికి చేర్పులు, మార్పులు మాత్రమే అమలులోకి వచ్చాయన్నారు. కార్డులోని వారి తొలగింపునకు మరణ ధ్రువీకరణ పత్రం సమర్పించాల్సి ఉందన్నారు. లబ్ధిదారులు హౌస్ హోల్డ్ మ్యాపింగ్, ఈ-కేవైసీ తప్పనిసరి అని పేర్కొన్నారు. ఈ నెల 15 నుంచి వాట్సాప్ గవర్నెన్స్ అందుబాటులోకి వస్తుందన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు.

15న అలంపురంలో ఉచిత వైద్యపరీక్షలు

పెంటపాడు: మండలంలో ఈనెల 15న అలంపురం సేవాట్రస్టు ఆసుపత్రిలో ఉచిత వైద్యపరీక్షలు చేయనున్నట్లు ట్రస్టు అధ్యక్షుడు కె. పెదకృష్ణంరాజు ఒక ప్రకటనలో తెలిపారు. ఎముకలు, కీళ్లు, జనరల్ సర్జన్, డెర్మటాలజీ, పల్మనాలజీ, ఈఎన్‌టీ ప్రత్యేక వైద్యులతో పాటు, ఆసుపత్రిలో ఈసీజీ, 2డీఈకో వంటి ఉచిత వైద్యపరీక్షలు చేయనున్నట్లు తెలిపారు. పరిసర గ్రామాల ప్రజలు ఈ సేవలను వినియోగించుకోవాలన్నారు.

సమ్మె విజయవంతానికి పిలుపు



వరిఘేడులో ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న వ్యవసాయ కార్మిక సంఘ నాయకులు

అత్తిలి: ఉపాధి హామీ చట్టం రక్షణ కోసం మే 20న దేశవ్యాప్తంగా జరుగుతున్న గ్రామీణ బంద్‌ను జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బళ్ల చినవీరభద్రరావు, కౌలు రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కేతా గోపాలన్ పిలుపునిచ్చారు. మంగళవారం అత్తిలి మండలం వరిఘేడు గ్రామంలో పనిచేస్తున్న ఉపాధి కూలీలను కలిసి వారితో కొంతసేపు మాట్లాడారు. ఈసందర్భంగా వీరభద్రరావు, గోపాలన్ మాట్లాడుతూ గ్రామీణ ప్రజల కొనుగోలు శక్తి పెరగాలంటే ఉపాధి హామీలో ప్రతి కుటుంబానికి 200 రోజులు పని కల్పించాలని, ప్రస్తుతం పెరిగిన ధరలకు అనుగుణంగా రూ. 600లు వేతనం ఇస్తేనే జీవించగలరని ఆర్థిక వేత్తలతో పాటు సుప్రీంకోర్టు సైతం చెప్పిందని వారు గుర్తు చేశారు. అయినా వీటిని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని వారు ఆరోపించారు. పనిసమయంలో మరణించిన వ్యక్తికి రూ. 25 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేయాలని పాలకవర్గాలు చేస్తున్న కుట్రలను తిప్పికొట్టి పోరాడి సాధించుకున్న ఈచట్టాన్ని రక్షించుకోవాలని అందుకు ఈనెల 20న దేశవ్యాప్తంగా ఉపాధి హామీ పనులు బంద్ చేద్దామన్నారు. వ్యవసాయ కూలీలు, గ్రామీణ పేదలు అధిక సంఖ్యలో ఈబంద్‌లో పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు. పితాని దానేశ్వరరావు, బొక్కా శ్రీను, బాలం చంద్రకళ, జోగి శ్రీనివాస్, కట్టాకుమారి, బాలం తులసమ్మ, జోగి సింహాచలం, పెచ్చెట్టి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పైళ్లమ్మకు ప్రత్యేక అభిషేకాలు

పెంటపాడు: మండలంలో ప్రత్తిపాడు గ్రామ దేవత పైళ్లమ్మ అమ్మవారి జాతర ఉత్సవాలు సందర్భంగా మంగళవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం గ్రామంలోని మహిళలు అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు చేశారు. సాయంత్రం అమ్మవారికి మంగళహరతులు ఇచ్చారు. గ్రామస్తులు, ఆలయకమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ముగిసిన ముత్యాలమ్మ ఉత్సవాలు: రామచంద్రపురం గ్రామంలో ముత్యాలమ్మ అమ్మవారి వార్షిక జాతర ఉత్సవాలలో భాగంగా మంగళవారం గ్రామంలో మొక్కులు తీర్చుకొన్నారు. అమ్మవారి ఆలయం వద్ద ప్రత్యేక పూజలు చేశారు.

నేపాల్ దేవ్ భట్టాచార్య మృతి తీరని లోటు



సంతాప సభ

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఆలిండియా రోడ్డు ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ ఫెడరేషన్ అఖిల భారత అధ్యక్షుడు నేపాల దేవ్ భట్టాచార్య మృతి తీరని లోటని పలువురు కార్మిక నాయకులు కొనియాడారు. భట్టాచార్య మృతి పట్ల సంతాప సభ పట్టణంలోని సీఐటీయూ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య భవనంలో జవ్వాది శ్రీను అధ్యక్షతన జరిగింది. సీఐటీయూ జిల్లా కార్యదర్శి కర్రి నాగేశ్వరరావు మాట్లాడుతూ నేపాల్ దేవ్ భట్టాచార్య తెల్లవారుజామున గుండెపోటుతో మృతి చెందినట్లు తెలిపారు. బెంగాల్ కార్మిక ఉద్యమ నాయకుడిగా, పార్లమెంట్ సభ్యుడిగా నిరంతరం ప్రజలకు కార్మికులకు ముందుండి నడిపారన్నారు. సీఐటీయూ పట్టణ కమిటీ సంతాపం ప్రకటించింది. ఈ కార్యక్రమంలో కరెడ్ల రామకృష్ణ, పబ్బాని సురేష్, ఎ.వేణు, యడవల్లి వెంకట దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

త్రీడీ ప్రింటింగ్ టెక్నాలజీతో మంచి భవిష్యత్



ఉపకరణాలను పరిశీలిస్తున్న నిట్ రిజిస్ట్రార్ దినేష్ శంకరరెడ్డి తదితరులు

తాడేపల్లిగూడెం: త్రీడీ ప్రింటింగ్ టెక్నాలజీతో విద్యార్థులకు మంచి భవిష్యత్ ఉంటుందని నిట్ రిజిస్ట్రార్ దినేష్ శంకరరెడ్డి అన్నారు. 8,9,10 తరగతుల విద్యార్థులకు ఉచిత త్రీడీ ప్రింటింగ్ టెక్నాలజీ శిక్షణ కార్యక్రమంలో మంగళవారం ఆయన మాట్లాడారు. ప్రపంచంలో అతి వేగంగా విస్తరిస్తున్న రంగాల్లో త్రీడి ప్రింటింగ్ విభాగం ఒకటన్నారు. ఈ టెక్నాలజీతో నాణ్యమైన వివిధ రకాల వస్తువులు, బొమ్మలు, భవనాలు, వంతెనలు ఎవ్వరికి నచ్చిన డిజైన్లలో వారు అందంగా ఆకర్షణీయంగా తీర్చిదిద్దుకోవచ్చన్నారు. ఈ టెక్నాలజీలో నైపుణ్యాలను పెంచుకొని అంకుర పరిశ్రమలను ఏర్పాటు చేసుకొనే స్థాయికి ఎదగాలన్నారు. విభిన్న రంగాల్లో త్రీడీ ప్రింటింగ్ టెక్నాలజీ కీలక పాత్ర పోషిస్తుందని డీన్ ప్లానింగ్ అండ్ డెవలప్‌మెంటు డాక్టర్ వి.సందీప్ అన్నారు. ఆచార్యులు కార్తికేయశర్మ మాట్లాడుతూ వివిధ పాఠశాలల నుంచి శిక్షణ కోసం 200 దరఖాస్తులు రాగా, వారిలో 40 మందిని ఎంపిక చేశామన్నారు. మెకానికల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి డాక్టర్ సంతోష్‌కుమార్ అధ్యక్షత వహించారు.

ఉత్సాహంగా విజ్ఞాన శిబిరాలు



శిక్షణ శిబిరంలో మాట్లాడుతున్న విద్యార్థిని



విద్యార్థులకు పుస్తక సమీక్ష చేస్తున్న విద్యార్థులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): విద్యార్థులు గ్రంథాలయాలకు వచ్చేటట్లు అలవాటు చేద్దామని రిసోర్స్‌పర్సన్స్ పేర్కొన్నారు. గ్రేడ్-1 శాఖ గ్రంథాలయంలో మంగళవారం వేసవి శిక్షణ శిబిరం జరిగింది. రిసోర్స్‌పర్సన్లుగా హాజరైన ప్రత్తి వీరాస్వామిచే పంచతంత్ర కథలు చెప్పారు. గ్రంథాలయంలోని వివిధ పుస్తకాలను చదివించారు. జి.బాపయ్య శర్మచే రవీంద్రనాథ్ ఠాగూర్ జీవిత విశేషాలను వెల్లడించారు. వి.జనార్ధనరావుచే పొడుపు కథలు, వేమన పద్యాలు చదివించారు. ఆర్.నాగేంద్రకుమార్‌చే ఇంగ్లీషు గ్రామర్ చెప్పారు. విద్యార్థులకు బిస్కెట్ ప్యాకెట్లు, మిఠాయిలు అందజేశారు. గ్రంథాలయ అధికారి వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ గ్రంథాలయాన్ని ప్రతి ఒక్కరు ఉపయోగించుకుని సద్వినియోగం చేసుకోవాలని వివరించారు.

అవసరంమేరకే సెల్‌ఫోన్‌లు వాడాలి

అత్తిలి: వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా అత్తిలి శాఖా గ్రంథాలయంలో మంగళవారం రిసోర్సుపర్సన్ ఎస్ సుబ్బయ్య విద్యార్థులతో కథలు చదివించి పుస్తక సమీక్ష చేయించారు. రిటైర్డు గ్రంథాలయాధికారి గంధం శేషవేంద్రరావు విద్యార్థులకు సెల్‌ఫోన్‌ల వాడకంపై అవగాహన కల్పించారు. విద్యార్థులు సెల్‌ఫోన్‌లకు దూరంగా ఉండాలని, సెల్‌ఫోన్‌ల వల్ల జరిగే లాభనష్టాలను వివరించారు. ఎక్కువ సేపు సెల్‌ఫోన్ వాడితే కళ్ల దెబ్బ తింటాయని, అవసరం మేరకు వాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయాధికారి డి కృష్ణారావు, ఎస్ దుర్గా ప్రసాద్, రంగినీడి దాన కృష్ణ, ఎం శ్రీదేవి, పి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులను ప్రోత్సహించాలి

భీమవరం: బడి వయసు కలిగిన దివ్యాంగ పిల్లలను గుర్తించి పాఠశాలలో పేర్లు నమోదు చేయించి వారిని ప్రోత్సహించాలని సమగ్ర శిక్షా జిల్లా అదనపు ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ పి.శ్యాంసుందర్ చెప్పారు. మంగళవారం భీమవరం పట్టణంలోని సమగ్ర శిక్షా కార్యాలయ ఆవరణలో దివ్యాంగుల గుర్తింపు, ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్యాం ప్రసాద్ మాట్లాడుతూ సమగ్ర శిక్ష ద్వారా భవిత కేంద్రంలో దివ్యాంగులకు కల్పిస్తున్న సదుపాయాలను కరపత్రాలతో అవగాహన కల్పిస్తున్నామన్నారు. సమగ్ర శిక్ష ద్వారా అవసరమైన దివ్యాంగుల పిల్లలకు ఉచిత ఉపకరణాలు అందిస్తున్నట్లు చెప్పారు.

గ్రీష్మతాపం.. రోడ్డు నిర్మానుష్యం



ప్రత్తిపాడు వద్ద జాతీయరహదారిపై ఎండ తీవ్రతతో నిర్మానుష్యంగా ఉన్న దృశ్యం

- దడపుట్టిస్తున్న ఎండలు
- మధ్యాహ్నం అయితే రాకపోకలు బంద్

పెంటపాడు: రోహిణీ కార్తె దగ్గరపడటంతో భానుడి ప్రతాపం మరింత పెరిగింది. జనవరి నుంచి ఎండలు తీవ్రంగా ఉన్నాయి. ప్రతి రోజూ 30 డిగ్రీల నుంచి 35డిగ్రీల వరకూ ఉష్ణోగ్రత ఉంటుంది. గ్రీష్మ తాపానికి ప్రజలు అల్లాడిపోతుంటే మంగళవారం భానుడి భగభగలకు మరింతగా ఉక్కిరిబిక్కిరయ్యారు. మండుటెండలతో ప్రజలు బెంబేలెత్తిపోయి, సాయంత్రం ఆరు గంటల వరకూ ఇళ్ల నుంచి బయటకు రాని పరిస్థితి నెలకొంది. ఎండ వేడికి వీస్తున్న వడగాలులకు వృద్ధులు, పిల్లలు తల్లడిల్లిపోతున్నారు. ఏసీలు, ఫ్యాన్ల కింద కూర్చున్నా ఫలితం దక్కడంలేదని ఆవేదన చెందుతున్నారు. కూల్ డ్రింకులు, జ్యూస్‌లు, కొబ్బరి బొండాలు, ముంజు కాయలకు డిమాండ్ పెరిగింది.

సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి



వెంకట్రామన్నగూడెంలో సమ్మె పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఇఫ్టూ నాయకులు

తాడేపల్లిగూడెం రూరల్: దేశ వ్యాప్తంగా ఈ నెల 20వ తేదిన జరగనున్న సమ్మెను జయప్రదం చేయాలని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ఇఫ్టూ సహాయ కార్యదర్శి మామిడి దానవరప్రసాద్ పిలుపునిచ్చారు. మంగళవారం మండలంలోని వెంకట్రామన్నగూడెం గ్రామంలో సమ్మె పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా దానవరప్రసాద్ మాట్లాడుతూ జాతీయ కార్మిక సంఘాల పిలుపు మేరకు ఈ సమ్మె చేపట్టినట్లు తెలిపారు. నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, పాత కార్మిక చట్టాలు అమలు చేయాలని, నూతన వ్యవసాయం, మార్కెటింగ్ చట్టాన్ని ఉపసంహరించాలని తదితర సమస్యల పరిష్కారానికి ఈ సమ్మె చేస్తున్నామన్నారు. దీనిని జయప్రదం చేయాలని కోరారు. ఇఫ్టూ నాయకులు కే.నాగేశ్వరరావు, మురళీ, సిద్దాబత్తుల కృష్ణారావు, తాడేపల్లి కుమార్, మానుకొండ జయరాజు, నీలపాల చల్లారావు, కలిదిండి సుబ్బారావు, శిరీష, డి.శ్రీనివాసరావు, గూడవల్లి శశిధర్, జయరాజు, రామాంజనేయులు, పుల్లారావు, దూలపల్లి రాణి తదితరులు పాల్గొన్నారు.

మెడికల్ కిట్లు అందుబాటులో ఉంచాలి



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కండెల్లి సోమరాజు

తాడేపల్లిగూడెం రూరల్: పని ప్రదేశాల్లో టెంట్లు, మెడికల్ కిట్లు అందుబాటులో ఉంచాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కండెల్లి సోమరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని మెట్ట ఉప్పరగూడెం గ్రామంలో ఉపాధి హామీ పథకం పని ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా శ్రామికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సోమరాజు మాట్లాడుతూ గతంలో ఇచ్చే పనిముట్లు, టెంట్లు లేకుండా ఉపాధి హామీ పథకం శ్రామికులను ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. తక్షణమే పని ప్రదేశాల్లో టెంట్లు, మెడికల్ కిట్లు ఏర్పాటు చేయాలని, మజ్జిగ, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధి శ్రామికులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం



పెంటపాడులో బాలికల కిశోర్‌వికాశంపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

పెంటపాడు: బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుజాత పేర్కొన్నారు. మంగళవారం పెంటపాడులో 4వ సెక్షన్ కిశోర్‌వికాశం పేరిట వేసవి శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా 15-18 సంవత్సరాల బాలికలకు ఆమె పోక్సో చట్టం, బాలికల హక్కుల, ఆరోగ్యపరిరక్షణ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎఎన్ఎం పూర్ణ, ఎంఎస్‌కే శ్రీవిద్య, అంగన్‌వాడీ ఉపాధ్యాయులు, సిబ్బంది, కిశోర్‌బాలికలు పాల్గొన్నారు.

బాలికలకు చట్టాలపై అవగాహన

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని అప్పారావుపేట అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం పోక్సో చట్టంపై కిశోర బాలికలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ కే.శ్రీదేవి మాట్లాడుతూ 2012 నుంచి పోక్సో చట్టం అమలులోకి వచ్చిందన్నారు. ఈ చట్టం కింద బాలికలను వేధించినా, అసభ్యకరంగా ప్రవర్తించినా నేరమని, అటువంటి వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అలాగే బాలికలకు వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సిబ్బంది, బాల బాలికలు, తదితరులు పాల్గొన్నారు.

గడ్డివాము దగ్ధం

పాలకోడేరు: మండలంలోని విస్సాకోడేరు గ్రామంలో మంగళవారం జరిగిన అగ్ని ప్రమాదంలో పదెకరాల గడ్డివాము దగ్ధమైంది. వివరాల్లోకి వెళితే విస్సాకోడేరు గ్రామానికి చెందిన రైతు బందారు సత్యనారాయణ పశు గ్రాసం నిమిత్తం పదెకరాల ఎండు గడ్డిని నిల్వ చేసుకోగా ప్రమాదవశాత్తు ఆ గడ్డివాముకు నిప్పు అంటుకోవడంతో ఒక్కసారిగా మంటలు ఎగబడ్డాయి. స్థానికులు భీమవరం అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించడంతో వెంటనే స్పందించిన అగ్నిమాపక సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని ఏడీఎఫ్ఓ సూర్య ప్రకాశం నేతృతంలో సుమారు గంట పాటు శ్రమించి మంటలను అదుపులోకి తీసుకురావడంతో పెను ప్రమాదం తప్పింది. ఈ అగ్ని ప్రమాదం వలన సుమారు 50 వేల రూపాయల ఆస్తి నష్టం సంభవించినట్లు ఏడీఎఫ్ఓ సూర్య ప్రకాశం తెలిపారు.

న్యాయం చేయాలని కలెక్టర్‌కు వినతి

పాలకోడేరు: మండలంలోని గొల్లలకోడేరు గ్రామంలో ఉన్న ప్రైవేట్ పాఠశాల మాజీ ప్రిన్సిపాల్ కృష్ణారావుపై ఇప్పటికే పలువురు ఫిర్యాదులు చేయగా, మంగళవారం మరొకరు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. భీమవరానికి చెందిన జవ్వాది రమేష్ స్థానిక విలేకరులతో మాట్లాడుతూ.. తన ఇద్దరు కుమారులను పాఠశాల లో చేర్పిన సందర్భంగా చెల్లించిన లక్షల రూపాయల ఫీజును ప్రిన్సిపాల్ పాఠశాలకు చెల్లించకుండా సొంతంగా వాడుకున్నాడని తెలిసిందన్నారు. స్కూల్‌కి వెళ్లి ఆరా తీయగా, ఇప్పుడాయన స్కూల్‌లో పని చేయ డం లేదని తెలిసిందని చెప్పారు. ప్రి న్సిపాల్‌ని నిలదీయగా, దురుసు గా ప్రవర్తించాడని, విచారణ జరిపి తన కు న్యాయం చేయాలని కలెక్టర్‌కు వినతిపత్రం అందించినట్లు తెలిపారు.